## పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ నమోదు

బల్మూరు, డిసెంబర్1: మండలంలో పోలింగ్ బూత్ నెంబర్ 146నుంచి 183వరకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని జినుకుంట పీఎస్146లో 959ఓట్లకు గాను 835మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 147వ పోలింగ్ కేంద్రంలో 757ఓట్లకు గాను 648, పోల్లెపల్లిలోని 148పోలింగ్ కేంద్రంలో 685 ఓట్లకు గాను 586ఓట్లు నమోదయ్యాయి. తుమ్మెన్‌పేట 149లో 1105 ఓట్లకు గాను , 793, 150పీఎస్‌లో 1181 ఓట్లకు గాను 946, కొండారెడ్డిపల్లి 151పీఎస్‌లో 780ఓట్లకు 652, కొత్తపల్లి 152పీఎస్‌లో 562ఓట్లకు 476, గట్టుతుమ్మెన్ 153లో 1256ఓట్లకు గాను 1037, 154లో 1191ఓట్లకు గాను 900, మంగళకుంటపల్లి 155పీఎస్‌లో 488ఓట్లకు గాను 429, చెన్నారం156లో 610ఓట్లకు 553, 157లో 638ఓట్లకు 585, మహదేవ్‌పూర్158లో 839ఓట్లకు 711, పోలిశెట్టిపల్లి159లో 1123ఓట్లకు 916, రాంగనర్‌కాలనీ160లో 1,174ఓట్లకు 925, పోలిశెట్టిపల్లి161లో 939ఓట్లకు 740, రామాజీపల్లి162లో 1,199ఓట్లకు 953, 163లో 951ఓట్లకు 749, గోదల్164లో 1,063ఓట్లకు 806, 165లో 1158ఓట్లకు 945, నార్సయపల్లి166లో 865ఓట్లకు 640, బల్మూరులోని 167లో 1085ఓట్లకు 810, 168లో 1,184ఓట్లకు గాను 889, 169లో 1,147ఓట్లకు 900, అనంతవరం170లో 893ఓట్లకు గాను 728, 171లో 616ఓట్లకు గాను 525,అంబగిరి 172లో 700ఓట్లకు గాను 574, కొండనాగులలోని బూత్‌లు 173లో 1012ఓట్లకు 312, 174లో 914ఓట్లకు 558, 175లో 1093ఓట్లకు 730, 176లో 1129ఓట్లకు 792, 177లో 630ఓట్లకు 447, 178లో 783ఓట్లకు 527, మైలారం 179లో 746ఓట్లకు 746ఓట్లకు 565, లక్ష్మీపల్లి 180లో 1041ఓట్లకు 910, బాణాల గ్రామంలో 181లో 1120ఓట్లకు 909, 182లో 808ఓట్లకు 669మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 34,424మంది ఓట్లకు గాను 26,320మంది ఓటుహక్కును వినియోగించుకొన్నారు. గ్రామల్లో ఎన్నికల కంటే ముందు ఓటు హక్కుపై ఎంత ప్రచారం అధికారులు చేసిన ఓటర్లు స్పందించలేదు. గత 2018 ఎన్నికల్లో 28వేలకు పైగా ఓట్లు నమోదయ్యాయి.

## మామను హత్య చేసిన అల్లుడు

- కేసు నమోదు చేసిన పోలీసులు
- మర్రిపల్లిలో ఘటన


వెంకటయ్య (ఫైల్)

ఉప్పునుంతల, డిసెంబర్ 1: అదనపు కట్నం కోసం పిల్లనిచ్చిన మామను దారుణంగా హతమార్చిన ఘటన మండల పరిధిలోని మర్రిపల్లిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై గురుస్వామి తెలిపిన వివరాలు.. మర్రిపల్లి గ్రామానికి చెందిన సోనమోనివెంకటయ్య(50), భార్య అలివేల కూతురు మాధవిని రెండేళ్ల క్రితం ఉప్పునుంతలకు చెందిన సాయిబాబతో వివాహం జరిపించారు. పెళ్లి సందర్భంగా 13 తులాల బంగారం, రూ.3.50 లక్షలు కట్నం కింద ఇచ్చారు. అలాగే ఎకరా పొలం ఇస్తామన్నారు. ఆరునెలల పాటు వారి కుటుంబం సాఫీగా జరిగింది. తాగుడుకు బానిసైన అల్లుడు తరచుగా తన కూతురును హింసించడం, కొట్టడం ప్రారంభించారు. ఎకరా పొలం అమ్మాలని అత్తామామలతో గొడవపడ్డాడు. గురువారం సాయంత్రం అత్తగారింటికి వెళ్లి అత్తతో కొట్లాడి పొలం వద్ద ఉన్న మామను రాయితో కొట్టి హత్య చేశాడు. పక్క పొలానికి చెందిన జగదీశ్, వెంకటయ్య మృతదేహాన్ని చూసి వెంటనే భార్య అలివేలకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఈ మేరకు కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి పరిశీలించగా ముఖం, తలపై గాయాలను గుర్తించారు. దీంతో అల్లుడు సాయిబాబపై అత్త అలివేల శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు నమోదు చేశామని ఎస్సై గురుస్వామి తెలిపారు.

# అతివలదే అందలం..

- నియోజకవర్గంలో 80.03శాతం పోలింగ్ నమోదు
- ఓటు హక్కు వినియోగించుకున్న 1,93,768 మంది
- వివరాలు వెల్లడించిన ఎన్నికల అధికారులు
- పోలింగ్ సరళిపై బీఆర్‌ఎస్ నాయకుల సమీక్ష

అచ్చంపేట, డిసెంబర్ 1: అచ్చంపేట నియోజకవర్గంలో 1,93,768మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మొత్తంగా పోలింగ్ 80.03శాతం నమోదైంది. వంగూరు మండలంలోని నిజాంబాద్‌లో సాయంత్రం 6:30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. అదేవిధంగా అచ్చంపేట మండలంలో అక్కారం, సిద్దాపూర్ గ్రామాలతో పాటు లింగాల, అమ్రాబాద్ మండలంలోని కొన్ని గ్రామాల్లో పోలింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. నియోజకవర్గంలో మొత్తం 2,41,129 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,93,768 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 265 పోలింగ్ బూత్‌లలో పురుషులు 97,866మంది, మహిళలు 95,900 మంది ఓటు వేశారు. సోమవారం సాయంత్రం ఎన్నికల అధికారులు పోలింగ్‌బూత్‌ల వారీగా పోలింగ్ నమోదైన జాబితాను విడుదల చేశారు.

**అచ్చంపేట మండలంలో..**

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 1: అచ్చంపేట నియోజకవర్గంలో పోలింగ్ సరళిపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల వారీగా సమీక్షించుకుంటున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో మండల, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయా కేంద్రాల వారీగా లెక్కలేసుకొన్నారు. కచ్చితంగా అచ్చంపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ముచ్చటగా మూడోసారి విజయం సాధించనున్నారని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సందడి ఎమ్మెల్యే ఇంటి వద్ద కనిపించింది.


పోలింగ్ తీరుపై గ్రామాల వారీగా అచ్చంపేటలో చర్చించుకుంటున్న బీఆర్‌ఎస్ మండల, గ్రామాల నాయకులు, కార్యకర్తలు

# గువ్వలకు శుభాకాంక్షలు


అచ్చంపేటలో విప్ గువ్వల బాలరాజును కలిసిన బీఆర్‌ఎస్ మండల నాయకులు

వంగూరు, డిసెంబర్ 1: ఎన్నికల అనంతరం అచ్చంపేటలో వున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజును మండల బీఆర్‌ఎస్ నేతలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో వంగూరు గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జంగయ్య, గాజర ఉప-సర్పంచ్ సైదులుతో పాటు నాయకులు కృష్ణ, సిద్దు, నిరంజన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## భ్రామరికి ఊయలసేవ


ఊయల సేవలో స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, డిసెంబర్ 1: శ్రీశైల మహా క్షేత్రంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామదేవత అంకాలమ్మకు అభిషేకాలు చేసి వార పూజలు చేశారు. సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి ప్రీతికరమైన గులాబీ, గన్నేరు, దేవగన్నేరు, నందివర్ధనం, గరుడవర్ధనం, మల్లెలు, చామంతులతో పుష్పాలంకరణ చేసిన ఊయలలో స్వామి అమ్మవార్లను వేంచేబు చేసి, సేవా మహాసంకల్పాన్ని పఠించి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, లలితాసహస్రనామాలతో షోడశోపచార క్రతువులు నిర్వహించారు.

# ముచ్చటగా మూడోసారి గెలిస్తే రికార్డే..

- అచ్చంపేటలో మరోసారి బీఆర్‌ఎస్ గెలుపునకు అవకాశం?
- అండగా నిలబడిన పేదలు, లబ్ధిదారులు, యువ ఓటర్లు
- గెలుపుపై పూర్తి విశ్వాసంతో బీఆర్‌ఎస్ శ్రేణులు

అచ్చంపేట, డిసెంబర్ 1: అచ్చంపేట ఓటర్లు మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించనున్నారు. వివిధ పథకాల్లో లబ్ధిపొందిన లబ్ధిదారులు, మహిళలు, యువఓటర్లు, యువకులు బీఆర్‌ఎస్‌కు అండగా నిలిచారని బీఆర్‌ఎస్ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. పోలింగ్ శాతం 80.03శాతం పెరగడంతో బీఆర్‌ఎస్‌కు కలిసివస్తుందని భావిస్తున్నారు. ఆసరా పింఛన్ పొందుతున్న వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు మరోసారి సీఎం కేసీఆర్‌కు అండగా నిలబడ్డారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన మహిళలు, రైతులు, పేదలు, ప్రధానంగా యువకులు బీఆర్‌ఎస్‌ను ఆదరించారు. కాంగ్రెస్ పార్టీ విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ చేసినప్పటికీ ఓటర్లు మాత్రం పూర్తివిశ్వాసంతో కారు వైపే ఉన్నారు. కేవలం ఉద్యోగులు, నిరుద్యోగులు కొంతమేర బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్నా, మిగిలిన వర్గాలు మాత్రం బీఆర్‌ఎస్‌కే ఓటు వేశారని భావిస్తున్నారు.

అయితే కాంగ్రెస్ పార్టీ గ్లోబల్ ప్రచారం చేస్తుందని, అచ్చంపేటలో కచ్చితంగా బీఆర్‌ఎస్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని చర్చించుకుంటున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సోమవారం తన నివాసం లో పోలింగ్ సరళి గురించి గ్రామాలు, మండలాల వారీగా ఆరా తీశారు. గ్రామాల్లో ముఖ్యులను పిలిపించుకుని ఓటింగ్ జరిగిన తీరుపై చర్చించారు. అందరితో చర్చించిన అనంతరం అచ్చంపేటలో తప్పనిసరిగ్గా బీఆర్‌ఎస్ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ఓటర్లు సీఎం కేసీఆర్‌కు అండగా నిలబడ్డారని పేర్కొంటున్నారు. గతంలో కూడా అచ్చంపేటలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని ఎన్నికల ఫలితాలు రాకముందే కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి బొక్కాబోర్లాపడిన సందర్భాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు గుర్తు చేస్తున్నారు.

మండలాల వారీగా సమీక్షించిన తర్వాత ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గెలుపుపై ధీమాతో ఉన్నారు. ఎంత తక్కువ మెజార్టీ వచ్చినా గెలిచితీరుతామని చెబుతున్నారు. అచ్చంపేట ప్రజలు విజ్ఞానవంతులని ఎవరి వల్ల అచ్చంపేట అభివృద్ధి సాధిస్తుందో తెలుసని, తప్పకుండా అచ్చంపేట గడ్డపై మూడోసారి బీఆర్‌ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని చెబుతున్నారు. అయితే ఓటింగ్ సరళి సైలెంట్‌గా బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉందని అంటున్నారు. మూడోసారి అచ్చంపేటలో బీఆర్‌ఎస్ గెలిస్తే గువ్వల బాలరాజు చరిత్రను తిరగరాసినట్లే. ఇప్పటివరకు అచ్చంపేటలో వరుసగా మూడుసార్లు గెలిచిన అభ్యర్థులు ఎవరూ లేరు. ఈ నేపథ్యంలో ఇది రికార్డుగా మారునుంది.